# Eenadu

## 26 దాకా గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ

### ఇప్పటివరకూ 1.83 లక్షలు దాఖలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, వరద బీభత్సాల నేపథ్యంలో గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. నిజానికి శుక్రవారంతో ముగియాల్సిన ఈ గడువును సోమవారం (ఈ నెల 26వ తేదీ) దాకా పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే దరఖాస్తు సమర్పించినా రుసుము చెల్లించనివారు 26 లోపు ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి పార్వతి సుబ్రమణ్యాన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల దాకా సుమారు 1.83 లక్షల మంది తాజాగా గ్రూప్-2కు దరఖాస్తు చేసుకున్నారు. గడువు పొడిగింపుతో దరఖాస్తుల సంఖ్య 2 లక్షల స్థాయిని దాటే అవకాశముంది. గతంలో విడుదల చేసిన ప్రకటనకు ఇప్పటికే 6 లక్షల దాకా దరఖాస్తులు దాఖలైన సంగతి తెలిసిందే.